సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న డైరెక్టర్ సుశీలారాణి

ఉక్కునగరం: స్థానిక సృష్టి వరల్డ్ పాఠశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ఇంటి వద్ద ఉపయోగం లేని వస్తువులతో రూపొందించిన మోడళ్లు ఆకట్టుకున్నాయి. 1500 మంది విద్యార్థులు నిర్వహించిన ఏరోబిక్స్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 2 వేల మంది విద్యార్థులు ఒకేసారి ఎర్త్ సాంగ్‌ను పాడడం అందరినీ అలరించింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పి. సుశీలా రాణి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భజలాల పరిరక్షణకు ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తిరుమలనగర్ వాసులు

కూర్మన్నపాలెం: భూగర్భజలాలను పరిరక్షించాలని కోరుతూ తిరుమలనగర్ వాసులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. భావితరాలకు నీటి సమస్య లేకుండా ఉండాలంటే ఇంకుడు గుంతలు తవ్వాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘ ప్రతినిధులు నాగభూషణ్, పరమానంద్, విశ్వేశ్వరరావు, వసంతరెడ్డి, స్వాతి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ట్రెకింగ్



ట్రెకింగ్‌లో పాల్గొన్న స్కౌట్స్, గైడ్స్

గాజువాక: ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక స్వామి విద్యానికేతన్‌కు చెందిన కూర్మమ్మ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు నిర్వహించిన ట్రెకింగ్ ఉత్సాహంగా సాగింది. ప్రకృతి పరిశీలన, పరిరక్షణ యాత్ర పేరుతో నిర్వహించిన కార్యక్రమం శంకర్‌నగర్, పాతగాజువాక, కొత్త గాజువాక, బీసీ రోడ్ జంక్షన్ మీదుగా జింక్ గేటు, కృష్ణానగర్ కొండపై సాగింది. కార్యక్రమంలో స్కౌట్స్ ఉపాధ్యాయుడు పాలూరి లక్ష్మణస్వామి, గైడ్ కెప్టెన్ సూర్యకుమారి, ప్యాట్రోల్ లీడర్లు రమేష్, వరలక్ష్మి, రేవంత్, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల కమిటీకి నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

కూర్మన్నపాలెం: కణితి గ్రామదేవతల కమిటీ నూతన కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేసింది. ముందుగా రథాలమ్మకు పూజలు చేశారు. చైర్మన్‌గా ప్రగడ శ్రీనివాస్, అధ్యక్షుడిగా సూరిశెట్టి పెంటారు, ప్రధాన కార్యదర్శిగా బడగల రాము, వైస్ చైర్మన్‌గా చిత్రాడ సన్యాసిరావు, గౌరవ అధ్యక్షుడిగా ఎ. రామునాయుడు, కోశాధికారిగా సీతారామరాజు, ఉపాధ్యక్షులుగా నూకరాజు, వెంకటరావు, సన్యాసిరావు, గోవింద్, దానప్పలు తదితరులు బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది రథాలమ్మ పండగ ఘనంగా నిర్వహించాలని తీర్మానం చేశారు.

నగర పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన నేపాల్ పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: నేపాల్ దేశం కఠ్మాండ్ జిల్లాకు చెందిన తప్పి పోయిన మహిళను గుర్తించినందుకు నగర పోలీసులకు నేపాల్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 11న కఠ్మాండ్‌కు చెందిన అనూషకుమ్ కనిపించక పోవడంతో ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన నేపాల్ పోలీసులు ఆమె గాజువాక ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఉత్తర్వుల మేరకు గాజువాక ఎస్ఐ నజీర్, కఠ్మాండ్ ఎస్ఐ అర్జున్‌తో కలిసి తుంగ్లాం పరిధిలో మహిళను గుర్తించి సోమవారం ఆమె తండ్రికి అప్పగించిన విషయం తెలిసిందే. దీనిపై కఠ్మాండ్ జిల్లా పోలీస్ రేంజ్ తరఫున లిఖితపూర్వకంగా నగర పోలీసులకు కృజ్ఞతలు తెలియజేశారు.



రహదారిపై పనికి పిలిచే దాతకోసం ఎదురుచూస్తున్న కూలీలు

ఉపాధి కరువు.. బతుకు బరువు

కూర్మన్నపాలెం: పల్లెల్లో పనులు లేక సుదూర ప్రాంతాల నుంచి ఉపాధి కోసం వేలాది మంది పారిశ్రామిక ప్రాంతానికి తరలి వస్తున్నారు. ఇందులో అధిక శాతం మంది భవన నిర్మాణ కార్మికులు, తాపీమేస్త్రీలు ఉంటున్నారు. కూర్మన్నపాలెం ప్రాంతలోని వారంతా ఎక్కడెక్కడో నివాసాలు ఏర్పరుచుకొని పనులకు పిలిచే దాతలకోసం ప్రతిరోజు తెల్లవారగానే రాజీవ్‌నగర్ కూడలికి చేరుకుంటారు. అక్కడ పనికోసం ఎవరు పిలుస్తారా అని గంటల తరబడి వేచిచూస్తుంటారు. ఆడ, మగ, తేడా లేకుండా క్యారేజీలు చేతపట్టి రహదారిపైనే నిల్చొని అడ్డాపై ఎదురు చూస్తున్నారు. ఎవరు వచ్చి బండి ఆపినా కూలీలు పరుగు పెడుతున్నారు.

విలవిల్లాడుతున్న వలస కూలీలు

ఉపాధిలేక వలస కూలీలు విలవిల్లాడుతున్నారు. వారానికి ఒక రోజు కూడా పని దొరకకపోవడడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ పరిణామంతో అనేక మంది అటు సొంతూరు వెళ్లలేక నగరంలో ఉండలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇందుకు రాజీవ్‌నగర్ ముఖ్యకూడలిలో పనుల కోసం ఎదురు చూస్తున్న వలస కూలీలే నిదర్శనంగా నిలుస్తున్నారు.

అడ్డాపై నిరీక్షించి ఉసూరుమంటూ వెనక్కి

ఆర్నెల్లగా తగ్గిన పనులు

ఆర్నెల్లుగా పనులు తగ్గిపోయాయి. దీంతో మధ్యాహ్నం 12 గంటల వరకు ఎదురుచూసి ఆ తర్వాత తిరుగుముఖం పడుతున్నారు. పనిదొరికిన రోజు తాపీ మేస్త్రికి రూ.900, మగ కూలీకి రూ.800, ఆడ కూలీకి రూ.700 దొరుకుతుందని అక్కడి కూలీలు చెబుతున్నారు. చాలా కాలంగా పనులు దొరక్కపోవడంతో వచ్చి వెళ్లేందుకు రవాణా చార్జీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు వలస కూలీలు వాపోతున్నారు. ఇసుక, పిక్క వంటి బిల్డింగ్ మెటీరియల్స్ అందుబాటులో లేకపోవడం.. ధరల పెరుగుదలతో నిర్మాణ దారులు ముందుకు రావడం లేదని చెబుతున్నారు. అందువల్లే ఎక్కడ నిర్మాణాలు అక్కడ ఆగిపోయి పనులు లేకుండా పోయాయని .. ఇదే పరిస్థితి కొనసాగితే తమ భవిష్యత్తు ఏంటో అర్థం కావడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వలస కూలీలు కోరుతున్నారు. గతంలో పనులు లేకపోయినా అమ్మఒడి, ఒంటరిమహిళ, చేయూత వంటి పథకాలు వచ్చేవని .. వాటితో జీవనం సాగించేవారిమని.. ఇప్పుడా ఆ పరిస్థితి లేకపోవడంతో పిల్లల చదువులు కూడా అగమ్యగోచరంగా మారిపోయాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి ఉత్తరాంధ్ర నుంచి వలసలు

విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, అరకు, పాడేరు, పాలకొండ, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి కూర్మన్నపాలెం ప్రాంతానికి వలస వచ్చిన కార్మికులు ఉన్నారు. ఈ ప్రాంతంలోని అపార్టుమెంట్ల సంస్కృతి ఎక్కువగా ఉండడం వల్ల భవన నిర్మాణాలు జరుగుతాయని దాని వల్ల పనులు దొరుకుతాయని ఆశతో వారంతా రాజీవ్‌నగర్ కూడలికి చేరుకుంటారు.

ఎలా బతకాలో..



నేను అనకాపల్లి జిల్లా రావికమతం నుంచి వలస వచ్చి రాజీవ్‌నగర్‌లో తలదాచుకుంటున్నాను. ప్రతిరోజు పనికోసం కూడలికు చేరుకోవడం పని ఇచ్చే దాతకోసం ఎదురుచూడడం సరా మామూలు అయింది. పని దొరికితే రోజుకు రూ.900 ఇస్తారు. మూడు నెలల్లో వారం రోజులే పని దొరికింది. దీంతో ఎలా బతకాలో తెలియడం లేదు.

– కరణం కోటేశ్వరరావు, తాపీమేస్త్రి

మా కష్టాలు ఎప్పుడు తీరుతాయో..



నేను నా భర్త పిల్లలతో కలసి విజయనగరం జిల్లా మారుమూల ప్రాంతం నుంచి ఇక్కడికి వలస వచ్చాం. మంగళపాలెంలో చిన్న ఇల్లు అద్దెకు తీసుకొని పనికోసం రాజీవ్‌నగర్ కూడలికి ప్రతిరోజు వస్తాం. ఇటీవల కాలంలో పనులు దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నాం. మా కష్టాలు ఎప్పుడు తీరుతాయో...

– ఉదుపు లక్ష్మి, మహిళా కూలీ

ఊరిలో పని లేక వచ్చా..



మా ఊరిలో పనిలేకపోవడంతోనే ఈ ప్రాంతానికి వలస వచ్చాం. ఇక్కడ కూడా అదే పరిస్థితి ఉంది. రోజూ వచ్చి ఇక్కడ కూర్చున్నా పనికి పిలిచే నాథుడు దొరకడంలేదు. భోగాపురం నుంచి వచ్చి రాసాలమ్మకాలనీలో నివాసం ముంటున్నాను. పనిలేక పోవడంతో రోజూ వచ్చిన దారినే తిరిగివెళ్లిపోతున్నాను.

– ఎం. వెంకటరమణ, కూలీ



పనుల కోసం ఎదురు చూస్తున్న వలస కూలీలు

భక్తిశ్రద్ధలతో బొర్రమాంబ మారువారం



ప్రత్యేక అలంకరణలో బొర్రమాంబ, అమ్మవారికి పసుపునీటితో అభిషేకం చేస్తున్న భక్తులు

అగనంపూడి: అగనంపూడి పరిసర ఎనిమిది గ్రామాల ఆరాధ్య దైవం బొర్రమాంబ అమ్మవారి మారువారాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొదటి వారం వివిధ కారణాల వల్ల పండగ చేయని వారు, ఎనిమిది గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి ముర్రాట సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పసుపు, కుంకుమ, గాజులు, చీరలు సారెలతో అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి.. ప్రసాదాలు అందించారు.

హజ్ కమిటీలో పార్టీనేతలకే చోటు

రాష్ట్ర హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇమ్రాన్ ఆరోపణ



గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన ఏపీ హజ్ కమిటీలో నిజమైన ఇస్లాం లకు అన్యాయం జరిగిందని రాష్ట్ర హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ మహ్మద్ ఇమ్రాన్ ఆరోపించారు. సెంట్రల్ హజ్ కమిటీ యాక్టు 35/2002, సెక్షన్ 18 సబ్ క్లాజ్ 3 ప్రకారం కమిటీలో ముగ్గురు మత ప్రబోధకులను నియమించాల్సి ఉందన్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం 13 మంది సభ్యులను నామినేట్ చేస్తూ ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేసిందని, ఇస్లాం పండితుల కోటాలో కూడా తమ పార్టీ కార్యకర్తలనే నియమించి వారిని పెద్దలుగా పేర్కొనడం విచారకరమన్నారు. ఇది ఇస్లాం ఆచారాలను అవమానించడమేనన్నారు. తొలిసారి హజ్ యాత్రకు వెళ్లేవారు హజ్ పవిత్ర కార్యాలు సక్రమంగా నిర్వహించడం కోసం, మక్కాలో తప్పిదాలు చోటుచేసుకోకుండా పరిపూర్ణంగా యాత్ర పూర్తి చేసేందుకు ఇక్కడ శిక్షణ ఇచ్చి పంపించడానికి ముఫ్తీ, ఆలిం, హాఫీజ్‌లను కమిటీలో నియమించాలనే నిబంధనలను విధించారన్నారు. ఈ నిబంధలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి.. టీడీపీ కార్యాలయంలో పని చేసే రిసెప్షనిస్టు, పార్టీ కార్యకర్తలను నియమించారన్నారు. ఇది ఇస్లాంను, హజ్ యాత్రను అవహేళన చేయడమేనని ఇమ్రాన్ ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జీవో 38ను రద్దు చేసి సబ్ క్లాజ్ 3 ప్రకారం అర్హులైన ఇస్లాం పండితులను నియమిస్తూ కొత్త జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు.

వుడా భూమిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఏర్పాట్లు!

అడ్డుకున్న గాంధీనగర్ వాసులు



ఇరువర్గాల మధ్య ఘర్షణ

పెదగంట్యాడ: ప్రభుత్వ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు రంగం సిద్ధం చేశారు. దీంతో గాంధీనగర్ వాసులు మంగళవారం అడ్డుకున్నారు. జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని చిన నడుపూరులో నూకాంబిక ఆలయం వెనుక గెడ్డ ఉంది. దానికి ఆనుకొని జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని గాంధీనగర్ ప్రాంతం ఉంది. అక్కడ స్థలం ఖాళీ ఉండడంతో స్థానికులు కొంతమంది అక్కడ చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.. ఆయా దుకాణాల యజమానులు ఆలయ కమిటీకి ప్రతి నెలా అద్దె రూపంలో రూ.1000 నుంచి రూ.2వేల వరకూ చెల్లిస్తున్నారు.. ఆ అద్దె డబ్బులతోనే ఆలయాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పుడు దుకాణాలను తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. దీనిపై సమాచారం అందుకున్న గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, గాంధీనగర్ వాసులతో కలసి అడ్డుకున్నారు. దీంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది..పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాలతో చర్చలు జరిపారు. అది వుడాకు చెందిన స్థలమంటూ గాంధీనగర్ వాసులు చెబుతుండగా, అది గెడ్డ స్థలమని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ స్థలం విషయంలో వీఎంఆర్‌డీఏ, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి



కర్రి ఢిల్లేశ్వరమ్మ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో మృతి చెందింది. గాజువాక సీఐ కోటేశ్వరరావు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో 69వ వార్డు నాతయ్యపాలెంకు చెందిన కర్రి ఢిల్లేశ్వరమ్మ (87), గోపిశెట్టి రమణమ్మలు గాజువాకలోని ఆస్పత్రికి బయలు దేరారు. నాతయ్యపాలెం నుంచి అక్కిరెడ్డిపాలెం వైపు రోడ్డు దాటి గాజువాక వెళ్లేందుకు ఆటో ఎక్కాలి. ఈ క్రమంలో గోపిశెట్టి రమణమ్మ ముందుగా రోడ్డు దాటేసింది. కానీ ఢిల్లేశ్వరమ్మ రోడ్డు మధ్యలోనే ఉండిపోవడంతో గాజువాక నుంచి ఎన్ఏడీ వైపు వెళ్తున్న స్కూటీ ఢిల్లేశ్వరమ్మను ఢీ కొట్టింది. దీంతో ఆమె తీవ్రగాయాలపాలైంది. వెంటనే స్థానికులు స్పందించి ఆమెను గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వారు రిఫర్ చేశారు.అక్కడ నుంచి అగనంపూడి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహన చోదకుడిని అదుపులోకి తీసుకుని గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రమాద వివరాలను సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. మృతురాలికి భర్త లేరని, వివాహాలైన ముగ్గురు కుమారులున్నారన్నారు.

వైభవంగా శ్రీవారి శాంతి కల్యాణం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వామి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సహిత శాంతి కల్యాణం జరిపించారు. ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి



వినాయకనగర్‌లో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

పెదగంట్యాడ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి న్యాయం చేయాలని వినాయకనగర్ లివింగ్ క్రైస్ట్ చర్చి పాస్టర్లు కె. శాంసన్, ఆరోన్‌జాన్ సుజిత్ కోరారు. ఈ మేరకు మంగళవారం వినాయకనగర్, చినగంట్యాడ నడుపూరు తదితర ప్రాంతాల్లో ఆయన మృతికి సంతాపంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి న్యాయం చేయాలని కోరారు. ఘటన జరిగి ఇన్ని రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణం క్రైస్తవులను మనోవేదనకు గురిచేసిందని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ర్యాలీ నిర్వహించామని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత తిరుపతిప్రసాద్ మృతికి సంతాపం



తిరుపతి ప్రసాద్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తిరుపతిప్రసాద్(56) మంగళవారం వేకువ జామున మిందిలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మరణించారు. ఈ సందర్భంగా పలువురు సంతాపం తెలిపారు. ఆయన లేనిలోటు తీర్చలేనిదని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ అన్నారు. తిరుపతి ప్రసాద్ వార్డు వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా ఎనలేని సేవలు అందించారని వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి అన్నారు. ఆయన మృతికి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, పలువురు నాయకులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పైడిమాంబ.. చల్లగ చూడమ్మా



పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న నర్సింగరావు

పెదగంట్యాడ: కొత్త కర్ణవానిపాలెం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు, సారె చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయ కమిటీ అధ్యక్షుడు అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భాస్కర్, నాయుడు, వెంకటరావు, శ్రీను, రాజు, కనకరాజు, అనిల్, వికాస్, కుమార్, కార్తీక్, మహేష్, పెంటారావు, ప్రసాద్, వరహాలరావు పాల్గొన్నారు.

పార్కింగ్ యార్డు వేలంలో అవకాశం కల్పించాలి

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని పార్కింగ్ యార్డు టెండర్లలో నిత్యం అనుభవం ఉన్న వారికే అవకాశం కల్పిస్తున్నారని, నిరుద్యోగులకు కూడా అవకాశం కల్పించాలని గాజువాక ప్రాంతానికి చెందిన నిరుద్యోగ యువత కోరారు. వీరు మంగళవారం ఆటోనగర్ ఐలా కార్యాలయంలో ఐలా కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిందుకు విచ్చేశారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెను తిరిగారు. నిబంధనలను సడలిస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు.

జీవకోటి మనుగడకు ధరిత్రే ఆధారం



పినమడక హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న రామకోటి

అగనంపూడి: ప్రాణకోటి మనుగడకు భూమాతే ఆధారమని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ అగనంపూడి (దివ్యజ్యోతి భవనం) ఇన్‌చార్జి బీకే రామకోటి అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంగళవారం ఓంశాంతి ఆధ్వర్యంలో పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, గాలి, ఆకాశం ప్రకృతిలో భాగమని, వాటిని కలుషితం చేయడం వల్ల జీవరాశులు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. నేటి ఈ భూతాపానికి మనిషి చేస్తున్న వికృత చేష్టలు, వికృత విన్యాసాలే కారణమన్నారు. సాంకేతికను వినియోగించుకొని అభివృద్ధి చెందుతున్నామని విరవీగుతున్న మనిషి భూ తాపానికి కారణమవుతున్నాననే విషయాన్ని మర్చిపోతుండడంతో భూకంపాలు, హుద్ హుద్ వంటి ప్రకృతి విలయాలకు కారణమనే విషయాన్ని మర్చిపోతున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.కొండబాబు, ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కొలిపాక అప్పారావు, కిడిమి హనుమంతురావు, అండిబోయిన మంగరాజు పాల్గొన్నారు.

ఆడపిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో భద్రతపై అవగాహన కల్పిస్తున్న గాజువాక పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: ఆడపిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గాజువాక పోలీసులు సూచించారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్లో మంగళవారం విద్యార్థినులకు భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పురుషులు అతిక్రమించి ప్రవర్తించినా, తాకినా, అవమానకరంగా ప్రవర్తించినా వెంటనే తల్లిదండ్రుకు తెలియజేయాలన్నారు. అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై పోక్సో కేసు నమోదు చేస్తామన్నారు. సమాజంలో ఆడపిల్లలు చాలా జాగ్రత్తగా మెలగాలని అసూచించారు. ప్రభుత్వం శక్తి యాప్‌ను తెచ్చిందని, ప్రతీ ఒక్కరూ దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ప్రమాదంలో ఉన్నామని గ్రహించిన వెంటనే శక్తి యాప్‌ను ఉపయోగించాలని, వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి రక్షణ కల్పిస్తారని చెప్పారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమారస్వామి, గాజువాక ఏఎస్ఐ వినయ్, సిబ్బంది హేమసుందర్, కొండలరావు, స్పందన, స్కూల్ పీడీ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఉక్కును ప్రైవేటీకరిస్తే ప్రతిఘటన తప్పదు



దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు డి. ఆదినారాయణ హెచ్చరించారు. కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న నిరాహారదీక్షలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు ఎంతో మంది ప్రాణత్యాగాలు చేసి కర్మాగారాన్ని సాధించుకున్నామన్నరు. ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ కుటిల రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేముడు, అనంద్, వర్మ, రమేష్, అప్పలరాజు, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.